స్ట్రీట్‌లైట్స్ మరమ్మతులకు ప్రణాళికలు : రొనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల నిర్వహణలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ ఏజెన్సీలను ఆదేశించారు. సీడీఎంఏ కార్యాలయంలో గురువారం ఈఈఎస్ఎల్ ఏజెన్సీ అధికారులతో వీధిదీపాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వీధిదీపాల మరమ్మతులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి దీపాల నిర్వహణలో ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే ఉపేక్షించమని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏజెన్సీ ప్రతినిధులు ఇంజనీర్ చీఫ్ జియాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో పెరగనున్న ఏఐ వినియోగం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ, చికిత్సల కోసం వైద్యరంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం నానాటికి పెరుగుతోందని ఏఐజీ ఆస్పత్రుల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బయాలజీ, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో భాగంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో గురువారం ప్రారంభమైన బయో అన్వేషణ 2024 సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. వైద్యరంగంలో ఏఐ వినియోగం కారణంగా రానున్న ఐదేళ్లలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డాక్టర్ రాజేష్ ఎస్ గోఖలే, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ హెడ్ ప్రొఫెసర్ జేఎస్ఎస్ ప్రకాష్‌తోపాటు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో 'యాక్ట్' క్లినిక్


'యాక్ట్' క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పూర్ణ కుర్కురే తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిని జయించిన సర్వైవర్స్ మున్ముందు ఇబ్బందులు ఎదుర్కోకుండా జీవితాన్ని సాఫీగా గడపడానికి యాక్ట్ (ఆఫ్టర్ కాంప్లిషన్ ఆఫ్ థెరపీ) క్లినిక్‌ను బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్నేషనల్ చైల్డ్ హుడ్ కేన్సర్ డే సందర్భంగా గురువారం ఇండియన్ కేన్సర్ సొసైటీ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పూర్ణ కుర్కురే ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం కారణంగా ఇప్పుడు కేన్సర్‌ను జయించిన వారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్య మాట్లాడుతూ చికిత్స పూర్తి అయిన తర్వాత సాధారణ జీవనాన్ని సాగించడానికి అవసరమైన సలహాలు, సూచనలు, ఇతరత్రా ఇబ్బందులను దూరం చేయడానికి ఈ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు ఎంవీటీ కృష్ణమోహన్, డాక్టర్ సెంథిల్ రాజప్ప, కల్పనా రఘునాథ్, వీరేంద్ర పాటిల్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో..


సెమినార్‌లో పాల్గొన్న వైద్యులు

రాయదుర్గం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ ఇమ్యూనో థెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా కాంటినెంటల్ ఆస్పత్రి పనిచేస్తుందని మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఏవీఎస్ సురేష్ తెలిపారు. గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో గురువారం ఇమ్యూనో ఆంకాలజీలో అడ్వాన్స్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మసాచ్‌సెట్స్ జనరల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ క్లినికల్ డైరెక్టర్, హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్ డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ మాట్లాడుతూ మిలనామ చికిత్స గురించి వివరించారు. ఈ సెమినార్‌లో ఇమ్యూనో థెరపీలో, క్లినికల్ డెవలప్‌మెంట్‌లో గుర్తింపు పొందిన డాక్టర్ రమీఇబ్రహీం, సీనియర్ అంకాలజిస్టు డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ గురు ఎన్ రెడ్డి విశిష్ట పాల్గొన్నారు.

చిన్నారులపై లైంగిక వేధింపుల చిత్రాలు...

● సోషల్ మీడియాలో వైరల్ చేసిన యువకుడి అరెస్ట్


నిందితుడు జెమ్‌షెడ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై లైంగికదాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఇతర నిషేధిత సమాచారాన్ని ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వ్యక్తిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సిటీ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీ ఏవీ.రంగనాథ్ వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఎస్‌కె.జమ్‌షెడ్ చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నట్లు సీఐడీ పోలీసులు గుర్తించారని తెలిపారు. తన పర్యవేక్షణలో డీసీపీ కవిత, ఏసీపీ శివమారుతి, ఇన్‌స్పెక్టర్ నరేష్ బృందం సాంకేతిక ఆధారాలు సేకరించి నిందితుడ్ని గుర్తించినట్లు తెలిపారు. పోలీస్ బృందం పశ్చిమబెంగాల్‌కు వెళ్లి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

10 శాతం కమీషన్‌పై..
సైబర్ నేరగాళ్లకు బ్యాంకు అకౌంట్లు..

● చెన్నైకి చెందిన సైబర్ కిలేడీ ఆటకట్టించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 10 శాతం కమీషన్ తీసుకుంటూ.. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతూ.. అమాయకులను మోసం చేస్తున్న సైబర్ కిలేడీని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ జాయింట్ సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ. 5.84లక్షలు పోగొట్టుకున్నాడు. దాంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ నరేష్ టీమ్.. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించగా.. చెన్నైకి చెందిన ఒక బ్యాంకు ఖాతాలో బాధితుని డబ్బు జమయినట్లు గుర్తించారు. చెన్నైకి వెళ్లిన టీమ్ బ్యాంకు ఖాతా ఉన్న అడ్రస్‌లో ఆరా తీయగా.. సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన ఒక మహిళ తన పేరుతో బ్యాంకు ఖాతాలు తీసి 10 శాతం కమీషన్‌తో సైబర్ నేరగాళ్లకు అద్దెకు ఇస్తున్నట్లు తెలిసింది. టెలీగ్రామ్‌లో పరిచయం అయిన ఒక మహిళ ఆదేశాలతో ఇలాంటి మోసపూరితమైన పనులు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి ఆమెను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చి కటకటాల్లోకి నెట్టారు.

సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక నిందితుడు సంస్థ అదనపు డైరెక్టర్ క్యాతం గణేష్(44)ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. ఇల్లుల శ్రీనివాస్, అతడి కుమారుడు రాకేష్ వర్మ సమతామూర్తి చిట్‌ఫండ్‌ను ప్రారంభించారు. గతంలో చిట్‌ఫండ్ మోసాలు చేసిన క్యాతం గణేష్ అదనపు డైరెక్టర్‌గా ఇందులో చేరాడు. మోసపూరిత వాగ్దానాలతో 110మంది నుంచి రూ. 1.30 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. వీరిపై పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు క్యాతం గణేష్‌ను గురువారం అరెస్ట్ చేశారు.

భూ వివాదం.. లాయర్, ఎమ్మెల్యేపై కేసు

(3వ పేజీ తరువాయి)

మ్యానేజ్ చేయాలని, అందుకు రూ. 10కోట్ల వరకు ఖర్చు అవుతుందని నమ్మబలికాడు. దాంతో సంఘం సభ్యులంతా డబ్బులు పోగేసి రూ. 7 కోట్లు వెంకటరమణకు ఇచ్చారు. ఇక మనం కేసు గెలిచినట్లేనని, మీరు స్వీట్లు పంచుకోవడానికి సిద్ధంగా ఉండాలని బాధితులను నమ్మించాడు. కానీ, అడ్వొకేట్ ఏనాడూ కేసును సీరియస్‌గా తీసుకోలేదు. అనుమానంతో అడ్వొకేట్ తీరుపై ఆరా తీయగా, ప్రత్యర్థుల నుంచి రూ.25 కోట్లు తీసుకొని వారికి సహకరిస్తున్నట్లు బాధితులు గుర్తించారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని అతడిపై ఒత్తిడి చేశారు. రూ. కోటి తిరిగి ఇచ్చిన వెంకటరమణ మిగిలిన డబ్బులు ఇవ్వకుండా వారిని వేధిస్తున్నాడు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను సంప్రదించి సంఘం నాయకుల నుంచి తనను బయటపడేయాలని మొరపెట్టుకున్నాడు. ఎమ్మెల్యే, అయన అనుచరులు సంఘం నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. దాంతో వేదుల వెంకటరమణ, ఎమ్మెల్యే బలాల నుంచి తమ సంఘానికి, తమ కుటుంబాలకు ప్రాణహాని ఉందని బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు న్యాయవాది, మలక్‌పేట ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను హయత్‌నగర్‌లోని బంజారా కాలనీ, ఇంజాపూర్‌లోని తుల్జాభవానీనగర్ కాలనీ, కమ్మగూడ లక్ష్మీనగర్‌లలో బంజారాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోగ్ బండారు (హోమం) నిర్వహించారు. అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి నివాళులు అర్పించారు. సేవాలాల్ చూపిన మార్గంలో నడుస్తామని పలువురు పేర్కొన్నారు. హయత్‌నగర్ బంజారా కాలనీ సేవాలాల్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎల్‌బీనగర్ నియోజకవర్గం టీఆర్ఎస్ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాంజ్యా నాయక్, బాలు నాయక్, గోవర్ధన్, అంజమ్మ, బలరాం, రఘుపతి, సీతారాంనాయక్, రేవంత్, రాములు నాయక్, కాశీరాం, శ్రీను నాయక్, బంటీ, అజయ్, బాలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

- ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం


సంత్ సేవాలాల్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత


ఆదర్శనగర్‌కాలనీలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ తదితరులు


హయత్‌నగర్ బంజారాకాలనీలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు రామ్మోహన్‌గౌడ్


సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సేవాలాల్ మహరాజ్ మార్గం అనుసరణీయం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై.. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ శ్రేయస్సు కోసం సేవాలాల్ చూపిన మార్గం అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, రమావత్ రవినాయక్, లింగంగౌడ్, రామావత్ రాములు, ఆంగోత్ శ్రీనివాస్, కేతావత్ గోపాల్‌నాయక్, సభావత్ కృష్ణనాయక్ పాల్గొన్నారు.

రూ.56.67కోట్లతో మీర్‌పేట్ బడ్జెట్

● సభ్యుల నిరసనల మధ్య ఆమోదించిన కౌన్సిల్


బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ దుర్గాదీప్‌లాల్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం గురువారం మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.56.67 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టారు. అయితే గతేడాది మిగులు బడ్జెట్ ఉండగా ఈసారి దాదాపు రూ.9కోట్లు అప్పు ఉన్నట్లు చెబుతున్నారని, సదరు అప్పుకు సంబంధించిన వివరాలు సమావేశంలో బహిర్గతం చేయాలని పలువురు సభ్యులు పట్టుబట్టడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఆదాయ వ్యయాల వివరాలను చెప్పడానికి భయమెందుకని సభ్యులు ప్రశ్నించారు.

వివరాలను సాధారణ కౌన్సిల్ సమావేశంలో తెలియజేస్తామని, ప్రస్తుతం బడ్జెట్ ఆమోదం కోసమే సమావేశం ఏర్పాటు చేసినందున బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలపాలని మేయర్ కోరారు. అయితే సభ్యులు మాత్రం ఆ వివరాలు చెప్పాల్సిందేనని, లేదంటే బడ్జెట్‌ను ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో పలువురు సభ్యులు సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు పేర్కొంటూ బయటకి వెళ్లిపోయారు. అప్పటికే రిజిస్టర్‌లో సభ్యులందరూ సంతకాలు చేసినందున బడ్జెట్‌ను అమోదించినట్టు అధికారులు చెప్పారు. అయితే సమావేశం నిర్వహించాలంటే కోరమ్ ఉండాలని చెప్పి తమతో ముందుగానే సంతకాలు చేయించుకున్నారని, తాము సమావేశాన్ని బహిష్కరించగా అవే సంతకాల ఆధారంగా బడ్జెట్‌కు ఆమోదం తెలుపుకున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని వాకౌట్ చేసిన సభ్యులు ప్రశ్నించారు. సభ్యులు ఉన్నా లేకున్నా రిజిస్టర్‌లో చేసిన సంతకాలే బడ్జెట్ ఆమోదానికి ప్రామాణికమని అధికారులు పేర్కొన్నారు. దాంతో రూ.56.67కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్టయింది. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, కమిషనర్ బి.చంద్రశేఖర్, బీజేపీ, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్లు కీసరి గోవర్ధన్‌రెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, మునిసిపల్ ఎస్ఈ ఆంజనేయులు, మేనేజర్ ఎస్.వెంకట్‌రెడ్డి, ఆర్వో అంజన్‌రెడ్డి, టీపీవో దేవానంద్, అకౌంటెంట్ సుహాసిని, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాలను సందర్శించిన ఉపకమిషనర్


వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును సందర్శించిన ఉపకమిషనర్ సుజాత

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వార్డు కార్యాలయాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తుంటానని జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత చెప్పారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం సర్కిల్ పరిధిలోని సరూర్‌నగర్, గడ్డిఅన్నారం, చైతన్యపురి, కొత్తపేట, ఆర్‌కేపురం వార్డు కార్యాలయాలను ఆమె సందర్శించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వార్డు కార్యాలయాల ద్వారానే పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలను స్థాయిని బట్టి వీలైనంత తొందరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ పోతే ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వవన్నారు. సమస్య పరిష్కరించనప్పుడే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆమె పరిశీలించారు. వైద్యులు పలు విషయాలను ఉపకమిషనర్‌కు వివరించారు. ఉపకమిషనర్ వెంట సిబ్బంది శ్రీనివాస్, నర్సింగ్ రావు, సరన్‌జిత్‌సింగ్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్

సీ డాక్ సేవలు అభినందనీయం

కొత్తపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమాచార సాంకేతిక రంగంలో సీ డాక్ సేవలు అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక విభాగం, ఎలక్ట్రానిక్ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) హైదరాబాద్ రజతోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్యానెల్ చర్చలో రాబోయే రోజుల్లో సాంకేతిక రంగంలో ఎదురయ్యే సవాళ్లను కొందరు ప్రస్తావించారు. వేడుకల్లో సీ- డాక్ హైదరాబాద్ డైరెక్టర్ పీ.ఆర్.లక్ష్మీఈశ్వరి, ఐఐటీ గాంధీనగర్ డైరెక్టర్ ప్రొ.రజత్ మూనా, వేరబుల్స్ టైటాన్ కంపెనీ చీఫ్ ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ రాజా నెరపతీ, సీ డాక్ హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్ డా.ఎస్.శరత్‌చంద్రబాబు మాట్లాడారు.

మెరుగైన ఆరోగ్యకరమైన జీవనం కోసం ..
ఉచిత వైద్య పరీక్షా శిబిరాలు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆరోగ్యకరమైన జీవనం కోసం శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యపరీక్షా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు కానుగంటి నర్సింహారెడ్డి తెలిపారు. యశోద ఆస్పత్రి సౌజన్యంతో శాలివాహననగర్ కాలనీ పార్క్‌లో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షా శిబిరంలో దాదాపు 2వందల మంది పరీక్షలు చేయించుకున్నారని ఆయన వివరించారు. మధుమేహం, రక్తపోటు, 2డీ ఈకో, ఈసీజీ, బరువుపై పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు నిర్వహించారు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సంతోష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రతిభ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంగీత, దంత వైద్యులు డాక్టర్ నదీమ్, క్యాంప్ కోఆర్డినేటర్ శ్రీధర్, క్లబ్ కార్యదర్శి కమలాకర్, కోశాధికారి యాదయ్య పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఉపకమిషనర్లు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు నియమితులైన ఉపకమిషనర్లు గురువారం విధుల్లో చేరారు. హయత్‌నగర్ ఉపకమిషనర్‌గా తిప్పర్తి యాదయ్య, ఎల్‌బీనగర్ ఉపకమిషనర్‌గా జకియా సుల్తానా, సరూర్‌నగర్ ఉపకమిషనర్‌గా ఎ.సుజాత బాధ్యతలు స్వీకరించారు.

మీర్‌పేట్‌లో బీఆర్ఎస్‌కు షాక్

● కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పద్మారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు

● మహిళా విభాగం అధ్యక్షురాలు కాంగ్రెస్‌లో చేరిక. నియోజకవర్గం రెడ్డి జేఏసీ అధ్యక్షుడు సైతం


కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పద్మారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌కు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మారెడ్డి గురువారం కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. మహిళా విభాగానికి చెందిన మహిళా నేతలు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అదేవిధంగా మీర్‌పేట్‌కు చెందిన రెడ్డి జేఏసీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బొర్ర సురేందర్‌రెడ్డి సైతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ మంత్రి అక్రమాలను వెలికితీస్తామని, ఆమె అనుచరుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని అన్నారు. బీఆర్ఎస్ ఇక మునిగిపోయిన నావ లాంటిదేనని, పాతాళానికి పడిపోయిన ఆ పార్టీ మళ్లీ పైకి రావడం కష్టమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జిల్లెలగూడ కార్పొరేటర్ పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కళాశాల చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

డిగ్రీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ కోర్సులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు టెక్స్ అకాడమి ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు కళాశాలలో అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్ష నిర్వహించారు. డిగ్రీ విద్యార్థి కసప కృష్ణమోహన్, గిరీష్, అభయ్‌శర్మ ఎంపికయ్యారు. కళాశాల చైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.శారద జ్యోత్స్న ప్లేస్‌మెంట్ అధికారి డి.అరవింద్, అధ్యాపకులు పులకేసీ, ఏ.వీ.ప్రమోద్, ఏవో వెంకటేష్, ఈవో సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మబిక్షంకు ఘన నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ స్వర్గీయ బొమ్మగాని ధర్మబిక్షం జయంతి వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ధర్మబిక్షం విగ్రహానికి జాతీయ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, పోరాట పటిమ కలిగిన అరుదైన నాయకుడు ధర్మబిక్షం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ప్రవీణ్‌గౌడ్, వేణుగోపాల్‌చారి, నరసింహ,యాదగిరి, ప్రసాద్, నవనీతతదితరులు పాల్గొన్నారు.

నాగోల్ చౌరస్తాలో.. పలువురు సీపీఐ నాయకులు హాజరై ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బొమ్మగాని నాగభూషణం, మహ్మద్ బషీర్, ఉడతల మల్లేష్‌గౌడ్, హుస్సేన్, కె.శ్రీనివాస్, రాజు, మల్లయ్య జి.కృష్ణ, నర్సింహ పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో..

మన్సూరాబాద్ డివిజన్ శాఖ కార్యదర్శి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో ఎరుకల నాంచారమ్మ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్మబిక్షం జయంతి వేడుకలను నిర్వహించారు. సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ హాజరై.. ధర్మబిక్షం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూజారి అనిత, పార్వతమ్మ, స్వామి, యాదయ్య, హేమలత పాల్గొన్నారు.

108 సిబ్బంది నిజాయితీ

హయత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ముందున్న ఆటోను బైకుతో ఢీకొట్టిన సంఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది తీవ్ర గాయాలకు గురైన యువకుడికి ప్రథమ చికిత్స చేసి స్థానికంగా ఉన్న సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించారు. గురువారం మధ్యాహ్నం హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం ముందు జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ ఏదులాబాద్‌కు చెందిన వెంకటేశ్ (26) అనే యువకుడు రూ.76 వేలు తీసుకుని బైకు మీద ఎల్‌బీనగర్ వైపునకు వెళ్తున్నాడు. యువకుడు హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ముందున్న గ్యాస్ సిలిండర్ ఆటోను ఢీ కొట్టాడు. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ సత్యం, పైలెట్ రవికుమార్‌లు అక్కడికి చేరుకుని తీవ్ర గాయాలకు గురైన వెంకటేశ్‌కు ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి హయత్‌నగర్‌లో ఉన్న సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించారు. యువకుడి జేబులో లభించిన రూ.76వేలను హయత్‌నగర్ పోలీసుల సమక్షంలో 108 సిబ్బంది బాధితుడి తండ్రికి అప్పగించారు. నిజాయితీ చాటుకున్న 108 సిబ్బందిని పోలీసులు, బాధితుడి తండ్రి అభినందించారు.

పోలీసుల అదుపులో నగల దొంగలు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన పట్టపగలే బంగారు నగల షాపులో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలు చాదర్‌ఘాట్ పోలీసులకు పట్టుబడ్డారు. సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి చాదర్‌ఘాట్ క్రైం పోలీసులు ముగ్గురు దొంగలను పట్టుకుని ఇదివరకు ఏమైనా నేరాలకు పాల్పడ్డారా, లేక కొత్తగా చోరీకి పాల్పడి పట్టుబడ్డారా అనే వివరాలను ఆరా తీస్తున్నారు. మలక్‌పేట అక్బర్‌బాగ్‌లోని కిస్‌వాహ్ జ్యువెలర్స్ షాపులో బుధవారం పట్టపగలే ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడి పారిపోయిన సంఘటన తెలిసిందే. పోలీసులకు పట్టుబడిన ఈ ముగ్గురు నిందితులు గుజరాత్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులని, గత కాలంగానే నగరంలోనే స్థిరపడినట్లు సమాచారం. పథకం ప్రకారం చోరీకి పాల్పడిన ఈ ముగ్గురు వ్యక్తులు మొదటిసారి చోరీకి పాల్పడి పట్టుబడ్డారా, లేక ఇదివరకు జరిగిన నేర చరిత్రతో ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మొత్తానికి చోరీ జరిగిన 24గంటల్లోపే ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం.



శ్రీవిద్యా ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్స్‌తోపాటు జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.సిద్దప్ప